పలు శుభకార్యాలకు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హాజరు

సూర్యాపేటలోని బీఆర్ఎస్ నాయకుడు బావ్‌సింగ్ కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 17 : సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం పలు శుభ కార్యాలకు హాజరయ్యారు. జిల్లా కేంద్రం లోని మన్నెం సదాశివారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్రముఖ నాయకుడు బైరు వెంకన్నగౌడ్ కుమారుడి వివాహ వేడుక, ఎస్ఆర్ఎన్ ఫంక్షన్ హాల్‌లో మాజీ సర్పంచ్ చింతలపాటి మధు కుమార్తె డోలారోహణ వేడుక, బాలాజీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నాయకుడు భావ్‌సింగ్ కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుక, కుడకుడలో బీఆర్ఎస్ కార్యకర్త రుద్రారపు నాగరాజు ఇంట్లో జరిగిన పండుగతో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా జరిగిన పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను, చిన్నారులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే తండ్రి గుంటకండ్ల రామ్‌చంద్రారెడ్డి, సతీమణి సునీత, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, తూడి నర్సింహారావు, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, బెల్లంకొండ యాదగిరి, సుధాకర్‌రెడ్డి, నిమ్మల స్రవంతి, సల్మా, కరుణ, అంజమ్మ, మహేశ్వరి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వంద రోజుల పాలనలో బీసీలకు అన్యాయం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

బొడ్రాయిబజార్, మార్చి 17 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలన బీసీలు ఆశించిన విధంగా లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో బీసీల వాటా ఇవ్వకుండా 5 శాతం ఉన్న అగ్ర కులాలకే అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని బీసీలు కోరుకున్నది ఇది కాదన్నారు. బీసీలు 60 శాతం ఉంటే 60 శాతం పదవులు ఎక్కడా అని ప్రశ్నించారు. 37 కార్పొరేషన్ చైర్మన్లలో బీసీలకు 20 ఇవ్వాల్సి ఉండగా 13 రెడ్డిలకు ఇవ్వగా 12 కూడా బీసీలకు ఇవ్వలేదని, నామినేటేడ్ పోస్టులు కూడా బీసీలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను తక్కువ అంచనా వేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నర్సింహ, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి నారాయణగౌడ్, జాజుల భాస్కర్, నరేశ్, మురళి, మట్ట రమేశ్, దాసరి వెంకన్న పాల్గొన్నారు.

సామాన్యుడి గౌరవం సమాచార హక్కు చట్టం

- ఆర్టీఐ మాజీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న మాజీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు

బొడ్రాయిబజార్, మార్చి 17 : సామాన్యుడి గౌరవమే సమాచార హక్కు చట్టమని, దేశంలోని ప్రజలంతా సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. సమాచార హక్కు వికాస సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమాచార హక్కు చట్టం-2005పై నిర్వహించిన ప్రస్తుత పరిస్థితులు-భవిష్యత్ కార్యాచరణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పరిపాలనలో పారదర్శకత ఉండాలని, అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, అవినీతి లేని పాలన కావాలనేది చట్టం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సమాచార హక్కు చట్టానికి కమిషనర్ లేకపోవడంతో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే కమిషనర్‌ను నియమించాలని కోరారు. సమాచార హక్కు చట్టంలో రాజకీయ నాయకులకు భాగస్వామ్యం కావాలని ఆ దిశగా ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపకుడు యలమాద కృష్ణారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉన్నం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి శివకుమార్, సహాయ కార్యదర్శి కిన్నెర ఉపేందర్, నియోజకవర్గ అధ్యక్షుడు దండ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామ్మూర్తి పాల్గొన్నారు.

20 నుంచి ఫణిగిరి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నాగారం, మార్చి 17 : ఈ నెల 20 నుంచి 31 వరకు ఫణిగిరి సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్ (నర్సింహారావు) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 20న స్వామివారిని సపరివార సమేతంగా గుట్టపైకి వేంచేయుట, 21న అధ్యయనోత్సవం, ప్రబంధ సేవాకాలం, 22న పరమ పదోత్సవం, 23న పుణ్యాహవచనం, మత్ గ్రహణ కంకణ దారణ, 24న గజారోహణ, గరుడముద్ద, శివధనురుభంగం, సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం(తలంబ్రాలు), 25న గరుడ సేవ, 26న రథోత్సవం, 27న హనుమంత సేవ, 28న చక్రస్నానం, 29న పుష్పయాగం, శేషసేవ, ఏకాంత సేవ, 30న బండ్లు తిరుగడం, గజసేవ, దీపోత్సవం, 31న సపరివారి సమేతంగా స్వామి వారి గ్రామ ప్రవేశం జరుగనున్నది.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

దేవతామూర్తులకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

కోదాడ, మార్చి17 : పట్టణంలోని కోదండ రామాలయంలో పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. సీతా లక్ష్మణ సమేత కోదండ రాముడు, అన్నపూర్ణ సమేత బోలా లింగేశ్వర స్వామి, వాసవి కన్యకా పరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, కృష్ణుడు, పరమేశ్వరి దేవతామూర్తుల విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యాగశాల వద్ద దేవతామూర్తుల విగ్రహాలకు మహిళా భక్తులు జలదివాసం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితుడు బొర్ర వాసుదేవ చార్యులు, ఆలయ ధర్మకర్తలు నాగబండి రంగా, నాగబండి రంగనాథ్, నందగోపాల్, అరవింద్, ప్రతిష్ఠ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు మార్గదర్శకాలు..

పెన్‌పహాడ్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

కోదాడ : పట్టణంలోని సిటీ సెంట్రల్ స్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ సలీం షరీఫ్

నేరేడుచర్ల, మార్చి 17 : ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న పది పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 225 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 40,375 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లకు, డీఓలకు, ఇన్విజిలేటర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది.

కాపీయింగ్‌కు బ్రేక్

పరీక్షల నిర్వహణలో మాస్ కాపీంగ్‌కు తావులేకుండా చూచిరాత నిరోధక చట్టం-1997ను సమర్థవంతంగా అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా వారిని దోషులుగా గుర్తించి చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బంది అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసుకుని వ్యవహరించాలి. లేకపోతే చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని విద్యా శాఖ అధికారులు హెచ్చరించారు.

చీఫ్, డీఓ చేయాల్సినవి..

- పరీక్ష కేంద్రాన్ని ముందుగా సందర్శించి ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు పరిశుభ్రత పరిశీలించాలి
- తాసీల్దార్, ఎస్‌పీహెచ్‌లకు పరీక్షల విషయం తెలియజెప్పాలి. వారి ఫోన్ నంబర్లు తీసుకోవాలి
- పరీక్షల నిర్వహణకు అన్ని ఫారాలు సిద్ధం చేసుకోవాలి
- డీ-ఫార్, ఓఎంఆర్ షీట్స్, పేపర్ సీల్, అంటెండెన్స్ షీట్స్ సరిపడా అందాయో లేదో చూసుకోవాలి

పరీక్ష జరుగుతున్న రోజుల్లో ఇలా..

- రోజు ఉదయం 7.45 గంటలకు సెట్ కాన్ఫెరెన్స్‌కు హాజరు కావాలి
- నిర్దేశించిన సమయాని కన్నా ముందు సీఎస్, డీఓ ఇద్దరు సంతకాలతో పరీక్ష కట్టల సీల్ తెరువాలి

ఇన్విజిలేటర్లకు సూచనలు..

- ఇన్విజిలేటర్లు పరీక్షల ప్రారంభానికి ముందు రోజున చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) నిర్వహించు శిక్షణ సమావేశానికి విధిగా హాజరు కావాలి. ఫొటో గుర్తింపు కార్డు తీసుకోవాలి. రోజు తప్పకుండా ఐడీ కార్డు ధరించాలి
- పరీక్ష పేపర్ల కోడ్స్, సరైన కాంబినేషన్ గుర్తించి విధిగా తెలుసుకోవాలి
- పరీక్ష రోజు ఉదయం 8 గంటలకు కేంద్రం వద్దకు రావాలి. 9 గంటలకు విద్యార్థులను పరీక్ష గదిలో కూర్చోబెట్టాలి. సమయం దాటిన తర్వాత విద్యార్థులను పరీక్షకు అనుమతించరాదు
- ప్రతి విద్యార్థిని సోదా చేసి, ఎటువంటి ఫర్‌బిడెన్ మెటీరియల్ లేదని నిర్ధారించాలి. విద్యార్థినులను మహిళా ఇన్విజిలేటర్లు మాత్రమే సోదా చేయాలి
- పరీక్షలు జంబ్లింగ్ విధానంలో జరుగుతాయి. అందువల్ల సీఎస్ నిర్ధారించిన సీటింగ్ అరేంజ్‌మెంట్‌ను గానీ, విద్యార్థులను గదులు మార్చడం గానీ చేయరాదు
- విద్యార్థులకు ఫొటో అన్ని వివరాలతో కూడిన హాల్ టికెట్ అందిస్తారు. విద్యార్థిని హాల్ టికెట్, అంటెండెన్స్ షీట్‌లోని ఫొటోతో పోల్చి నిర్ధారించుకోవాలి, అభ్యర్థిపై అనుమానం ఉంటే వెంటనే సీఎస్ దృష్టికి తీసుకురావాలి
- అన్ని పరీక్షలు బార్ కోడింగ్ విధానంలో జరుగుతాయి. ఉదయం 8.45 గంటలకు ఓఎంఆర్ ప్రధాన/అదనపు సమాధాన పత్రాలు సీఎస్ నుంచి పొందాలి
- ప్రధాన సమాధాన పత్రంలోని సూచనలను, ఓఎంఆర్ షీట్ వెనుక భాగంలో విద్యార్థులకు వివరించాలి
- ఓఎంఆర్ షీట్ మినహా ఏ పేపర్‌పైనా కూడా హాల్ టికెట్ నంబర్, పేరు రాయించకూడదు
- ఓఎంఆర్ షీటు ఏదైనా కారణంతో పాడైతే, వెంటనే సీఎస్ దృష్టికి తీసుకువెళ్లి, నాన్ స్టాండర్డ్ ఓఎంఆర్ షీట్ పొందాలి
- ఓఎంఆర్ షీట్‌పై ఉన్న బార్‌కోడ్స్ రాయడం గానీ, నలుపడం గానీ చేయకుండా విద్యార్థులను హెచ్చరించాలి
- 9.25 గంటల లోపు ఇన్విజిలేటర్ అన్ని పనులు ముగించుకుని 9.30 గంటలకు కచ్చితంగా ప్రశ్నాపత్రాలు ఇవ్వాలి
- ప్రశ్నాపత్రాలు తీసుకున్న వెంటనే చాలిన్ని ఉన్నాయో/ఆ రోజుకు సంబంధించిన సబ్జెక్ట్/పేపర్ కోడ్/ మీడియం సరి చూసుకోవాలి. పేపరు ఏమాత్రం తప్పుగా ఇచ్చినా సంబంధిత ఇన్విజిలేటర్‌పై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.
- అన్ని ద్వితీయ భాష పేపర్లకు, అన్ని భాషేతర పేపర్లకు పార్ట్-బి బిట్ పేపర్ పరీక్ష చివరి అరగంట ముందుగా ఇవ్వవలెను. మిగిలిన పేపర్లకు పార్ట్-ఏ తో పాటే పార్ట్-బి ఇవ్వాలి
- గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్‌ను ఎర్ర సిరా పెన్‌తో క్యాన్సిల్ చేయాలి
- సమాధాన పత్రాలు, అడిషనల్ షీట్స్ అన్ని సరిచూసుకున్నాకే విద్యార్థులను బయటకు పంపాలి.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మేళ్లచెర్వు, మార్చి 17 : సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు మండల కేంద్రంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో 690 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈఓ సైదానాయక్ ఆదివారం తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 180, అభ్యాస్ స్కూల్‌లో 180, కృషి విద్యాలయం-ఏ సెంటర్‌లో 180, బీ సెంటర్‌లో 150 మం ది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు డిపార్ట్‌మెంటల్ అధికారులు, 44 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మఠంపల్లి : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ పానుగోతు చత్రూ నాయక్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగే 10వ తరగతి పరీక్ష ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో మొత్తం 12 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో 465 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

నేరేడుచర్ల : పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ చత్రూనాయక్ తెలిపారు. నేరేడుచర్లలో పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 19 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 639 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో 230 మంది, శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 189, ప్రగతి విద్యాలయంలో 220 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

గరిడేపల్లి : గరిడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జడ్పీహెచ్ఎస్‌లో 118 మంది, కేజీబీవీలో 90 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 235 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

హుజూర్‌నగర్ : పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సైదానాయక్ తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి, వీవీఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 660 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 325 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈఓ నకిరేకంటి రవి తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 230 మంది, ఎంపీపీఎస్ పరీక్ష కేంద్రం నందు 95 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది, ఫాతిమా పాఠశాలలో 200, కృష్ణవేణి పాఠశాలలో 200 మంది మొత్తం 640 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓ శాంతయ్య తెలిపారు.

కోదాడ డివిజన్‌లో 17 పరీక్షా కేంద్రాలు

కోదాడ : కోదాడ డివిజన్‌లోని కోదాడ, అనంతగిరి, చిలుకూరు, మునగాల, నడిగూడెం మండలాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదు మండలాల్లోని 17 సెంటర్లలో మొత్తం 3,285 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. వారిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1,715, ప్రైవేట్ విద్యార్థులు 1,570 పరీక్షలకు హాజరు కానున్నారు.

మోతె : పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎంఈఓ గోపాల్‌రావు తెలిపారు. ఆదివారం పరీక్ష కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మామిళ్లగూడెం సెంటర్‌లో 83 మంది , మోతె సెంటర్‌లో 108 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు.

రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, మార్చి 17 : రైస్ మిల్లు యజమానులు కుమ్మక్కై చేస్తున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం సీపీఐ అనుబంధ సంఘాలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి రైతులు వేసిన పంటలు చాలా వరకు ఎండిపోయాయని, మిగిలిన పంటకు సైతం గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల యజమాన్యం సిండికేట్‌గా వ్యవహరిస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఉన్న మిర్యాలగూడలో కూడా ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం జరుగుతున్నదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, కొమగ్రాజు వెంకట్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బాలాజీనాయక్

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలాజీనాయక్

మఠంపల్లి, మార్చి 17 : మఠంపల్లి మండలంలోని 540 సర్వే నంబర్‌లో గల భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ గుర్రం బోడు భూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇస్లావత్ బాలాజీనాయక్, తెలంగాణ ప్రజల సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోమగాని నరేందర్‌గౌడ్ ఆదివారం తాసీల్దార్ మంగా రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 540 సర్వే నంబర్ భూములపై జరిగిన ఘటనలు, రైతులపై దాడులు, అక్రమ అరెస్ట్‌లు, ఇద్దరు తాసీల్దార్ల సస్పెన్షన్లను వివరించినట్లు తెలిపారు. అప్పటి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జరిపిన సర్వే రిపోర్ట్‌ను బహిర్గతం చేసి సాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులను గుర్తించి వారికి పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు.

28న కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోదాడ టౌన్, మార్చి 17 : కోదాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 28న నిర్వహించనున్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక కోసం సోమవారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభించనున్నారు. సీనియర్ న్యాయవాది వేజెళ్ల రంగారావును ఎన్నికల అధికారిగా నియమించారు. సహాయ ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు షేక్. జానీపాషా, ఆవుల మల్లికార్జునరావును నియమిస్తూ బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, ఈ నెల 19న నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం అర్హత కలిగిన నామినేషన్ల వివరాలు ప్రకటించనున్నారు. 22న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ఉందని, అనంతరం సాయంత్రం 5 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నారు. ఈ నెల 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి గెలుపొందిన వారి వివరాలు ప్రకటించనున్నారు.

అవయవ దానం

నేరేడుచర్ల, మార్చి 17 : నేరేడుచర్ల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి గరిణె పాండురంగయ్య బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వాసవి క్లబ్ చొరవతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మిర్యాలగూడకు చెందిన డైమండ్ నేత్రాలయ వైద్య బృందం నేత్రాలను సేకరించింది.

పేకాడుతున్న ఆరుగురు అరెస్ట్

పెన్‌పహాడ్, మార్చి 17 : పేకాట ఆడుతున్న రుగురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. మండల పరిధిలోని మాచారం శివారులో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సమాచారం మేరకు రైడ్ చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.1,500 సీజ్ చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

తిరుమలగిరి, మార్చి 17 : తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని గుండెపురి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్న రోజు వారిగా కల్లు గీతకు వెళ్లి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. వెంకన్నకు భార్య, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తుంగతుర్తి ఏరియా దవాఖానాకు తరలించారు.

బ్రిడ్జీలు, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.79.57 కోట్లు మంజూరు

హుజూర్‌నగర్, మార్చి 17 : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో నూతన బ్రిడ్జీలు, బీటీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి 2024-25 సంవత్సరానికి సంబంధించి సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.79.57 కోటలు మంజూరు చేసినట్లు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నియోజకవర్గంలో కలిపి 50 పనులకు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

నాగారంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

నాగారం, మార్చి 17 : ప్రతి ఒక్కరూ భారత ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని నాగారం, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం మండలాల ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లీడర్ దారా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సూర్యాపేట-జనగామ జాతీయ రహదారి 365బి పై వాహనాల తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ వల్కి వెంకన్న, శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ కిరణ్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు, మార్చి 17: పార్లమెంట్ షెడ్యూల్ విడుదలై ఎన్నికల కోడ్ మొదలైన నేపథ్యంలో మండల కేంద్రంలోని రాజకీయ పార్టీలు, నాయకుల ఫ్లెక్సీలను తొలగించే ప్రక్రియను అధికారులు ఆదివారం ప్రారంభించారు. స్థానిక ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సిబ్బంది తొలగించారు. తాసిల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ ఈ ప్రక్రియను పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రబాబు ఉన్నారు.

రుణమాఫీ చేసి పంట నష్ట పరిహారం చెల్లించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

- ఏఐకేఎంఎస్ నాయకులు

అర్వపల్లి, మార్చి 17 : రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ మాట్లాడుతూ..యాసంగి నుంచి క్వింటాకు రూ.500 బోసన్ ఇవ్వాలని, మద్దతు ధరల చట్టం అమలయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఇఫ్ట్యూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన క